Acc. No. 3278

# ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం. ఏ., పిఎచ్. డి.

# తెట్టు (వేజెళ్ళవారు)

## ప్రవేశిక

ఇది ప్రాచీనమైన కమ్మరాష్ట్రమందలి ఆంధ్ర క్షత్రియ సంస్థానములలో నొకటి. కొండవీడు మొదలుగా నెల్లూరులోని కందుకూరు తాలూకా గుడ్లూరు దాఁక గల ప్రాంతము ఈ సంస్థానమునందలిది. 'తెట్టు' ఆనాఁటి పాలకుల ముఖ్యపట్టణము. నేఁటి కందుకూరు తాలూకాలో కందుకూరునకు దక్షిణదిశలో అమడదూరమునను, గుడ్లూరునకు ఆగ్నేయదిశలో నొక పరువు దూరమునను 'తెట్టు' గ్రామమున్నది. ఈ సంస్థానపాలకులను 'గుడ్లూరు ప్రభువు' లనియు వ్యవహరించెడివారు. ఈ సంస్థానము కుంఫిణీవారికాలమునాఁటికే అంతరించి యుండినది.

## సంస్థాన చరిత్రము

ఒంగోలుసీమను బాలించిన మందపాటివారికి వేజెళ్ళవారు వియ్యంకులు. వేజెళ్ళ పోలమరాజు ఈ సంస్థాన స్థాపకుఁడు. ఇతఁడు పదునైదవ శతాబ్దివాఁడు. ఈ పోలమరాజు కుమారుఁడు పాపరాజు (1440—1490). ఇతనికొడుకు కసవ రాజు (1490—1522). అయ్యవరాజు (1522—1558). సర్వరాజు కసవరాజు కుమారులు. పెద్ద నరసరాజు (1558—1600). చిన్ననరసరాజు అయ్యవరాజు తనయులు. పెద్ద నరసరాజు కొడుకు కుమార కృష్ణమరాజు (1600—1630). కుమార కృష్ణమరాజు తనయుఁడు కుమార నారాయణరాజు (1630—1678). ఇతనికి కృష్ణమరాజు (1678—1693). రాఘవరాజు అను నిరువురు కుమారులు. జ్యేష్ఠుడగు కృష్ణమరాజు మనుమడు కుమార కృష్ణమరాజు (1730—1750). ద్వితీయుఁడగు రాఘవరాజునకు అయ్యవరాజు, సర్వరాజు అను నిద్దరు కుమారులు*. అయ్యవరాజు తన తమ్ముఁడగు సర్వరాజు లేక సత్తిరాజును హైదరాబాదు కొలువులో నుంచి గుడ్లూరుసీమను జాగీరుగాఁ దెచ్చి తాను టంగుటూరునకు దాపున గల సోమరాజుపల్లెలో కోటను గట్టికొని జాగీరు ననుభవించుచుండెనఁట; సత్తిరాజు 'తెట్టు'పాలకుఁడుగా నుండెనఁట. సత్తిరాజు మరణింపఁగా సత్తిరాజు సంస్థానమునకు పాలకులగుటకు సమీపజ్ఞాతులు లేకపోయిరఁట; వేజెళ్ళవారి మంత్రులలో నొకడును, తెట్టు సంస్థానాధీశుఁడగు వేజెళ్ళ సత్తిరాజుగారియొద్ద

* వంశవృక్షము విషయమున గురజాడవారి కవిజీవితములు, కోన వేంకటరాయ శర్మగారి దండనాథులును మతభేదమును గలిగియున్నవి.

మంత్రియునునగు వెన్నెలకంటి వెంగన, సత్తిరాజు పెదతండ్రియగు కృష్ణమరాజు మనుమలు కుమార కృష్ణమరాజుగారిని (క్రీ. శ. 1730—1750) పాలకునిగాఁ బ్రకటించి ఫౌజుదారునొద్దకుఁ గొనిపోయి రాజ్యమును కృష్ణమరాజునకు స్వాధీన పఱిచెనఁట : ఈ విషయము ఈ క్రింది పద్యమువలన తెలియుచున్నది.

'వేజెళ్ళ సత్తిరాజు విభవాధిపత్యంబు
   పూనిన సర్వజ్ఞ పుణ్యమూర్తి
పొలుపొంద నా కృష్ణభూపాలబాలుని
   దొరజేసికొని కార్య మరసి నడపె
శ్రీరంగరాయలచే నొప్పుగొని తెచ్చి
   పంచవన్నెల డాలుపరగఁ జేసె
కొండవీటి సరద్దు గుడ్లూరు దనుకను
   ఏలించె కృష్ణభూపాలు నెమ్మి
సకల ప్రజ్ఞానుదక్షుఁడై జనులఁ బ్రోచె
రాజసమ్మానములచేతఁ దేజమలరె
బంధుజనముల సకలసంపదలఁ దనిపె
మహితయశుఁడు వెంగనమంత్రి యపుడు*'.

వెంగనమంత్రి తనయు లేవురును వేజెళ్ళవారి మంత్రులఁట ! కుమార కృష్ణమరాజు ననంతరము వేజెళ్ళ నారాయణరాజు సంస్థానకర్తయైనట్లు క్రింది పద్యమువలనఁ దెలుచున్నది :

'రామన్న మరియాద రామన్న వేజెళ్ళ
   నారాయణేంద్రుండు గారవమునఁ
జనవీయ నాయన సంస్థానకర్తయై
   పాలించుఁ బ్రజల సంపదలఁ బొదల
గోలకొండ వజీర్లఁగూడి మర్గాలపై
   ముత్తిక హత్తించి మొత్తిమొత్తి
కడు మన్నెసరదార్ల వడిసెడఁగాఁ గొట్టి
   రాజుచే మెప్పులు రమణనొందె
పొదిలెలింగప్పతోఁ గూడి భూములెల్లఁ
గొట్టి విప్రుల కన్నంబు బెట్టి మించె,
గలియుగంబున వెన్నెలకంటి రామ
మంత్రికిని నీడులే రని మహికి నెక్కె'

ఈ పద్యమునందు పేర్కొనఁబడిన రామన్నమంత్రి వెన్నెలకంటి వెంగనామాత్యుని యైదుగురు పుత్రులలో రెండవవాఁడు. ఈ పద్యమునం దుదాహరింపఁబడిన

* గురజాడ శ్రీరామమూర్తి, కవిజీవితములు, పు. 687 ; దండనాథులు, పు. 308.

నారాయణేంద్రుఁడు కుమార కృష్ణమరాజునకు పిమ్మట తెట్టును పాలించిన పెద్ద నారాయణరాజుగారు.

వేజెళ్ళ వెంకటనారాయణరాజు ఒంగోలుప్రభువులగు మందపాటివారికి మేనమామ. నారాయణరాజుతనయ అచ్చమాదేవి ఒంగోలుపాలకుఁడగు మందపాటి రామచంద్రరాజుభార్య. పెదనారాయణరాజుగారితో సంస్థానాధిపత్య మంతరించినట్లు తోఁచుచున్నది. చాటువులలోఁ గన్పట్టుచున్న వేజెళ్ళ వేంకట కృష్ణరాజు వేజెళ్ళవారి వంశవృక్షమున నే తరమునకుఁ జెందినవాఁడో నిర్ధారించుటకు సాధనములేవియును లేవు. సంస్థానము కర్ణాటకపు నవాబునకు దఖలుపడిన దరిమిలా సంస్థానపు వారసులకు భరణములేర్పడియుండినవి. వేజెళ్ళవారి సంతతివారు నేఁటికిని గలరని ఆంధ్రవిజ్ఞానము పేర్కొనుచున్నది.

## సాహిత్యపోషణము

వేజెళ్ళవారి సంస్థానమునందు ప్రసిద్ధివహించిన సోదరకవులు మోచెర్ల వెంకన్న, మోచెర్ల దత్తప్పయనువారు. 'కవితపుట్టిల్లు వెన్నెలకంటియిల్లు, పచ్చి చొచ్చెను మోచెర్లవారియిల్లు' అని ఒక యాభాణకము. కవితాకన్య వెన్నెలకంటి వారియింటఁ బుట్టి మోచెర్లవారియిల్లు మెట్టినదని చెప్పుటచే ఈ రెండు విద్వత్కవికుటుంబములకు వియ్యము లుండినవి కాఁబో లని కొందఱి యూహము. ఆనాఁటి మోచెర్లకవుల రచనలేవియో తెలియదు. మోచెర్ల కవి సోదరుల చాటువులుమాత్రము నూఱార్లు కన్పట్టుచున్నవి. ఆశుకవిత్వము నందును, సమస్యాపూరణమునందును ఈ కవులు దిట్టలఁట! వెంకటగిరి సర్వజ్ఞ యాచమనాయనిచే పరాభవింపఁబడిన యొక విద్వాంసుఁడు తన్ను శరణువేఁడఁగా దత్తప్పకవి అభయమొసఁగి అతనిని వెంటఁగొని సర్వజ్ఞ యాచమనీని యాస్థానమునకేఁగి ప్రభునివంచించి పశ్చాత్తప్తునిఁజేసి, యా విద్వాంసుని బహూకరింపఁజేసె నను నొక కథ ప్రచారములోనున్నది[1].

ఈ సందర్భమున పేర్కొనఁబడిన ప్రభువు వేంకటగిరి పాలకులు సర్వజ్ఞ కుమార యాచేంద్రులవారు. రాజును దర్శించిన కవి మోచెర్ల వెంకన్న యని అముద్రితగ్రంథచింతామణి అభిప్రాయము. వెంకన్నకవి యాశుకవితా శక్తిని పరీక్షించుటకు శ్రీ యాచేంద్రులవారు షాది క్షాంతవర్ణములుగల కందశతకము నొక్క గడియలో చెప్పుఁడని కోరఁగా వెంకన్నకవి పై నియమములతో దుష్కర ప్రాసబద్ధముగా శతకమును జెప్పి ప్రభువును మెప్పించెనఁట[2].

మోచెర్ల దత్తప్పకవి కృతముగా సంభావింపఁబడుచున్న సమస్యాపూరక

1 ఆంధ్రవిజ్ఞానము, సంపుటము 5, పు. 2586.

2 ఉదాహరణ పద్యములు వెంకటగిరిసంస్థానచరిత్రలో నీఁబడినవి.

పద్యములు నూఱుదాఁక సేకరింపఁబడి 'తెలుగు సమస్యలు' అను పేర నొక లఘుకృతి ముద్రితమయియున్నది*. దత్తప్పకవి పూరించె నను నమ్మకముగల సమస్యా పద్యములతోపాటు ఇతరకవుల రచనలుగా ప్రసిద్ధమైన 'అద్దిర శ్రీ ఘూనీశలు', 'కుంజర యూథంబు దోమ కుత్తుక సొచ్చెన్' వంటివి కూడ కొన్ని ఇందు చేర్పఁబడినవి. 'ఏకాదశినాడు సత్తె మేదే గడియల్', 'చెలువుగ రామలక్ష్మణులు సీతకుఁ దమ్ములు శంఖఁడన్నియున్', 'సుగ్రీవుని యెదమకాలు శునకముగఁబచెన్', 'భార్య లిద్దరు శ్రీరామచంద్రునకును', 'గుంద్రాతికి కాళ్ళు వచ్చి గునగున నడచెన్' మొదలగు సమస్యల పూరణములిందు గలవు.

వేజెళ్ళ వెంకటకృష్ణరాజు మీఁదిదని క్రిందిచాటువు చాటుపద్యమణి మంజరిలో నుదాహరింపఁబడినది.

> 'చెలఁగెన్ వేజెళ సార్వభౌముఁడు జయశ్రీశాలి, సింహాసన
> స్థలిలో నేడపరాజు, దిగ్విజయ కీర్తుల్ వానివే, వానితోఁ
> గలహం బెప్పుడు వద్దురా, రిపునృపుల్ ! గర్వించి మార్కొంటిరా
> పులితో లేళ్ళు, విహంగపుంగవునితోఁ బూరేళ్ళు పోరాడుటల్'
>
> —పు. 97.

* వ్యవహారతరంగిణీ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1880.

## ఉపజీవ్య గ్రంథసూచి

1. మోచెర్ల దత్తప్ప, తెలుఁగు సమస్యలు.
2. ఆంధ్రవిజ్ఞానము, సంపుటములు 5, 6.
3. అక్కిరాజు నరసింహారావు, శ్రీరామచంద్రవిజయము.
4. కోన వేంకటరాయశర్మ, దండనాథులు, పుటలు 308—312.
5. గురజాడ శ్రీరామమూర్తి, కవిజీవితములు, పుటలు 687—692.
6. అముద్రిత గ్రంథచింతామణి.